క్లుప్తంగా

ముద్రగడకు సంఘీభావం



ముద్రగడకు సంఘీభావం తెలుపుతున్న ముస్లిం మత పెద్దలు

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభానికి పలువురు ముస్లిం పెద్దలు, ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. శనివారం కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి వెళ్లి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ సీనియర్ నాయకుడు ముద్రగడ పద్మనాభం నివాసంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

గండేపల్లి: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శనివారం ఇంట్రామ్యూరల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు, పోటీతత్వాన్ని పెంపొందించేందుకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు. వైస్ చాన్సలర్ ఎస్ రమాశ్రీ, రిజిస్ట్రార్ జి.సురేష్, డీన్ వి.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.రవి పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న రామరాజువర్మ

ప్రత్తిపాడు: పేదల సంక్షేమానికి సదా మీ సేవలో వంటి స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు శ్లాఘనీయమని ఏలేశ్వరం మండలం యర్రవరం పంచాయతీ కార్యదర్శి ఎంవీ రామరాజు వర్మ కొనియాడారు. స్థానిక బజారు వీధి రామాలయం వద్ద శనివారం సదా మీ సేవలో (ఎస్ఎంఎస్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు, ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సాయాన్ని వినియోగించుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో షిర్డీ సాయి జ్యూయలరీస్ అధినేత పడాల శ్రీనివాస రెడ్డి, అంతర్జాతీయ ఛాయా చిత్ర అవార్డు గ్రహీత సలాది కృష్ణ, సంఘ భేరి రాంబాబు, ఎస్వీ సోమేశ్వరరావు, జాజిమొగ్గల జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

లింగంపర్తిలో థ్యాంక్యూ మోదీజీ

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో శనివారం థ్యాంక్యూ మోదీజీ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు గరికి నాగు, మండల అధ్యక్షుడు కరెడ్ల ఏసుబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 2025–26 ఏడాదికి గాను ఈ నెల 1న ప్రకటించిన కేంద్రబడ్జెట్‌కు మద్దతుగా ప్రజల నుంచి పోస్టుకార్డులను పంపడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని బీజేపీ నాయకులు తెలిపారు. అనంతరం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలో బీజేపీ విజయం సాధించడంతో పార్టీ నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గెడ్డం సత్తిబాబు, అల్లు సత్యనారాయణ, పూతిక నాగు, శ్రీమంతుల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

తొండంగి: మండలంలోని అన్నయ్యపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ వీరభద్రరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని అన్నయ్యపేట, పైడికొండ, వేమవరం, ఆనూరు, జి.ముసలయ్యపేట, గృహ, చిన్నతరహా పరిశ్రమలు, వ్యవసాయ విభాగాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్‌సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు

తుని/ప్రత్తిపాడు రూరల్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో పట్టణంలోని ఆ పార్టీ శ్రేణులు శనివారం సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి కేక్ కట్ చేశారు. పట్టణంలో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ తుని నియోజకవర్గ కన్వీనర్ వెలుగుల గోపాలకృష్ణ మాట్లాడుతూ ఢిల్లీలోని 70 స్థానాలకు గాను 48 సీట్లు గెలవడం ఆనందంగా ఉందన్నారు. బీజేపీని దేశ ప్రజలు ఆదరిస్తున్నారనడానికి ఇదే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కాదంబరి రామకృష్ణ, సీనియర్ నాయకులు ఆకెళ్ల శాస్త్రి, నారాయణాచార్యులు, షేక్ అహ్మద్, మండపాక శేషాచలంబాబా తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రత్తిపాడు మండలం ధర్మవరంలోనూ బీజేపీ శ్రేణులు సంబరాలు జరిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఊటా వీరబాబు ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

మోతాదు మించితే ముప్పే

- అధిక రసాయనాల వినియోగంతో పంటలకు నష్టం
- పిచికారీలో జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న అధికారులు
- నియోజకవర్గంలో 6,500 హెక్టార్లలో రబీ వరిసాగు



పెద్దిపాలెంలో పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

ప్రత్తిపాడు రూరల్: నియోజకవర్గంలో రబీ వరి నాట్లు దాదాపు పూర్తయ్యాయి. విత్తనాలు చల్లింది మొదలు రైతులు ఎరువులు, పురుగు మందులతోనే సహవాసం చేస్తున్నారు. పంట ఏపుగా ఎదిగేందుకు ఎరువులు వేస్తున్నారు. తెగుళ్ల నివారణకు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. అవసరమైన మోతాదులో ఎరువులు, పురుగు మందుల వినియోగంతో పంటలకు మేలు జరుగుతుంది. రైతులకు అనవసర వ్యయాన్ని తగ్గిస్తుంది. కాగా కొందరు రైతులు నిపుణుల సూచనలు పక్కన పెట్టి మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వినియోగించి నష్టపోతున్నారు. దీనివల్ల చీడపీడల బెడద మరింత పెరిగిపోవడమే కాకుండా భూసారం తగ్గుతుంది, పెట్టుబడి ఖర్చు సైతం పెరిగిపోతోంది. రైతులు ఏ మాత్రం వరిపైరు తేడాగా కనిపించినా వెంటనే రసాయనాలను ఆశ్రయిస్తున్నారు. వరినాట్లు వేసి వారం తిరగకుండానే ఎరువుల వాడకం ముమ్మరం చేస్తున్నారు.

నియోజకవర్గంలో ఇలా...

ప్రత్తిపాడు నియోజకవర్గంలో 6,500 హెక్టార్లలో ఈ ఏడాది రైతులు రబీ వరి సాగు చేస్తున్నారు. నాట్లు వేసిన రైతులు వారం రోజులు కూడా తిరగకుండానే మొదటి దఫా ఎరువులు వేయడం పూర్తి చేసినట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. సాగులో కొద్దిపాటి మెళకువలు, వ్యవసాయ సిబ్బంది సూచనలు, సలహాలు పాటిస్తే రైతులకు అనవసర వ్యయం తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని అధికారులు చెబుతున్నారు.

సూచనలు పాటిస్తే మేలు

ఒక హెక్టారు పొలానికి 78 కిలోల నత్రజని ఎరువును మూడు భాగాలుగా చేసి ఒక భాగం దమ్ములో, మరో భాగం నాటిన రెండు వారాల తర్వాత, మూడో భాగం నెల రోజులు తర్వాత వేసుకోవాలి. కానీ రైతులు నాటిన వారం రోజులకే నత్రజని ఎరువు వేస్తున్నారు. దీనిని వేప పిండితో కలిపి వేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. భాస్వరం, డీఏపీ లేదా కాంప్లెక్స్ రూపంలో ఒకే దఫాగా వేసుకోవాలి. జింక్ లోపం ఉన్నట్లు గుర్తిస్తే ఒక గ్రాము జింక్‌ను ఒక లీటరు నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

సేంద్రియ ఎరువులు వినియోగించాలి



రైతులు సేంద్రియ ఎరువులు వినియోగిస్తే భూసార పరిరక్షణతో పాటు నాణ్యమైన ఉత్పత్తులు సాధించవచ్చు. మోతాదుకు మించి రసాయన ఎరువులు వినియోగించడం వల్ల భూమి చౌడు బారే అవకాశం ఉంది. రైతులు ప్రకృతి సాగుపై దృష్టి సారించాలి.

– వై గంగాధర్,
మండల వ్యవసాయ అధికారి, ప్రత్తిపాడు.

రైల్వే గేటులో చిక్కుకున్న లారీ

- ట్రాఫిక్‌కు అంతరాయం



రైల్వే గేటు వద్ద గడ్డర్‌కు చిక్కుకున్న పార్సిల్ లారీ

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరం శివారు పెద్ద గేటు (రైల్వే గేటు)లో పార్సిల్ లారీ చిక్కుకుపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. శనివారం ప్రైవేట్ సంస్థలకు చెందిన పార్సిల్ లారీ తునిలో లగేజి దిగుమతి చేసి 16వ నంబర్ జాతీయ రహదారిపైకి వెళ్లేందుకు బయలుదేరింది. హై ఓల్టేజ్ విద్యుత్ లైన్‌కు వాహనాలు తాకకుండా ఉండేందుకుగాను రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన గడ్డర్లకు పార్సిల్ లారీ తగిలింది. అటుగా వెళ్లేందుకు వీలు లేకుండా లారీ గడ్డర్‌కు మధ్యలో నిలిచిపోయింది. దీంతో వాహనాలు రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. ఎంత ప్రయత్నం చేసినా గడ్డర్‌కు తగులుకున్న లారీ ముందుకు, వెనుకకు కదల్లేదు. రైల్వే పోలీసుల ఆలోచనతో టైర్లలో గాలి తీసివేయగా లారీ ఎత్తు తగ్గి గడ్డర్ నుంచి ముందుకు వెళ్లింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



పాత సంచుల వర్తక సంఘం నూతన కార్యవర్గం

తుని: పాత సంచుల వర్తక సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. స్థానిక గరువువీధిలోని పాత సంచుల వర్తక సంఘం భవనంలో సంఘ నూతన అధ్యక్షుడు గణపర్తి కృష్ణ, ఉపాధ్యక్షుడు వంగలపూడి మహేష్, కార్యదర్శి బొడ్డా శివ గణేష్, సహాయ కార్యదర్శి చోడిశెట్టి శ్రీనివాసరావు, కోశాధికారి వీర్ల ఈశ్వరరావు, సహాయ కోశాధికారి మిరియాల రామకృష్ణ, 12 మంది కార్యవర్గ సభ్యులతో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సకురు నాగేంద్ర నెహ్రూ ప్రమాణ స్వీకారం చేయించారు. వర్తక సంఘానికి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చేందుకు కార్యవర్గం కృషి చేయాలని నాగేంద్ర నెహ్రూ కోరారు. చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు నరిశే శివాజీ, కంకిపాటి జమీలు, వర్తక సంఘం ప్రతినిధులు చోడిశెట్టి బాబూరావు, తాకాశి అప్పారావు, చోడిశెట్టి వెంకటరమణ, కోలా రాము, చోడిశెట్టి సత్యనారాయణ, కంకిపాటి రామం, అత్తిలి మురళీ కృష్ణ, భీమనాథుల భాస్కరరావు తదితరులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

పాండవుల తీర్థం ప్రారంభం

- తిరునాళ్లలో భక్తుల రద్దీ
- జూదాలు నిర్వహించకుండా భారీ పోలీసు బందోబస్తు



రంపయర్రంపాలెంలో పాండవుల మెట్టపై భక్తుల రద్దీ

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో శనివారం పాండవుల తీర్థం ఘనంగా ప్రారంభమైంది. తొలిరోజు మండలం నుంచే కాకుండా చుట్టుపక్కల మండలాల నుంచి వేల సంఖ్యలో భక్తులు పాండవుల మెట్టకు పోటెత్తారు. కొండపై గుహల్లో ఉన్న పాండవులు, ద్రౌపదీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండపై పాలు పొంగించి పాండవులకు నైవేద్యాలు నివేదించారు. కొండ దిగువన ఉన్న శ్రీకృష్ణుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ తీర్థానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ తీర్థంలో సందడి చేశారు. తొలిరోజు కొండకు వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు రెండు వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేత తోట రాంజీ పాండవుల మెట్టను దర్శించుకున్నారు.

అన్నదానానికి రూ.1.11 లక్షల విరాళం

పాండవుల తీర్థంలో అన్నదానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాస్‌రావు రూ.1.11 లక్షల విరాళం అందజేశారు. పాండవుల మెట్టపై ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన ఈ మొత్తాన్ని గ్రామపెద్దలు, కమిటీ సభ్యులకు అందజేశారు.



అన్నదానానికి రూ.1.11లక్షల విరాళం అందజేస్తున్న కంబాల శ్రీనివాసరావు

ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు

తీర్థం ముసుగులో ఎటువంటి జూదాలు నిర్వహించకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. గతంలో ఇక్కడ కోడిపందేలు, గుండాట, పేకాట వంటి జూదాలు నిర్వహించేవారు. గత 10 సంవత్సరాలుగా ఎటువంటి జూదాలు నిర్వహించకుండా పోలీసులు కట్టడి చేశారు. ఈ ఏడాది కూడా ఎటువంటి జూదాలు జరగకుండా ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ పికెట్ నిర్వహించారు. ఈ బందోబస్తును నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్, కోరుకొండ సీఐ సత్యకిశోర్‌లు పర్యవేక్షించారు.

156 మందికి కంటి పరీక్షలు



ఏలేశ్వరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు కిరణ్

తుని రూరల్: మండలంలోని కొత్త సూరవరంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 156 మందికి కంటి పరీక్షలు చేసినట్టు హైమా నేత్రాలయం వైద్యులు డాక్టర్ పీఎస్ఆర్ ప్రసాద్ తెలిపారు. వీరిలో 36 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశామన్నారు. వీరికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. తుని రోటరీక్లబ్ అధ్యక్షుడు సీహెచ్ మంగరాజు, కార్యదర్శి ఎస్.వీర్రాజు, కోశాధికారి కె.కిషోర్‌రెడ్డి, రోటరీ ప్రతినిధులు డాక్టర్ ఎ.హరికృష్ణ, డి.ప్రసన్న కుమార్, కెవీఎస్.భద్రరావు, కె.ఈశ్వర్ గణేష్, వైద్య సిబ్బంది, తదితరలు పాల్గొన్నారు.

78 మందికి కంటి పరీక్షలు

ఏలేశ్వరం: పట్టణంలోని మండల పెన్షనర్స్ కార్యాలయంలో శనివారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన ఆకిరా కంటి ఆసుపత్రి వైద్యులు కిరణ్ సుమారు 78 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 15 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వైద్య సిబ్బంది నారాయణరావు, సురేష్, పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు ఇబ్రహీం ఖాన్, సంఘ నాయకులు సత్యగాంధీ, తాతారావు, పుల్లయ్య, జహీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ పునఃప్రతిష్ఠ



రంపయర్రంపాలెంలో పునఃప్రతిష్ఠ చేసిన శ్రీదేవి ఆలయం వద్ద భక్తుల కోలాహలం

గోకవరం: రంపయర్రంపాలెంలోని గంగాభవానీనగర్‌లో శ్రీదేవి అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. సుమారు రూ.40 లక్షలతో ఆలయం నిర్మించి అమ్మవారి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. దీనిలో భాగంగా మూడు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి శనివారం శిఖర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ముగిసిన స్పందన యువజనోత్సవాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ధనుంజయరావు, విజయ్‌ప్రకాష్

తుని: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు యువజనోత్సవాలు దోహదం చేస్తాయని ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్.ధనుంజయరావు అన్నారు. శ్రీప్రకాష్‌లో శనివారం జరిగిన స్పందన యువజనోత్సవాల ముగింపు వేడుకలకు ధనుంజయరావు, శ్రీప్రకాష్ పూర్వపు విద్యార్థి, సైంటిస్ట్ చలపతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి సంధానకర్తగా చరవాణి-తక్షణ ప్రజాదరణకు దారి తీస్తుందా ? లేదా మానవ దివాలాకు దారి తీస్తుందా ? అనే అంశంపై నిర్వహించిన చర్చాగోష్ఠిలో విద్యార్థులు తమ అభిప్రాయాలను అతిథులతో పంచుకున్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలని ధనుంజయరావు సూచించారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎ.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ

అన్నవరం: భీష్మ ఏకాదశి పర్వదినం శనివారం రత్నగిరిపై సత్యదేవుని ప్రాకారసేవ ఘనంగా నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై ప్రతిష్ఠించి ఊరేగింపుగా తూర్పురాజగోపురం వద్దకు తీసుకువచ్చారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు కొబ్బరికాయ కొట్టి ప్రాకార సేవ ప్రారంభించారు. వేదమంత్రాలు, బాజాభజంత్రీల నడుమ స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద మూడు సార్లు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను తిరిగి ప్రధానాలయానికి చేర్చారు. కాగా ప్రతి శనివారం ఉదయం పది గంటలకు నిర్వహించే ప్రకార సేవను ఈ వారం భక్తుల రద్దీ కారణంగా సాయంత్రం నిర్వహించారు.

గ్లాసుల అందజేత



ఈఓకు గ్లాసులు అందజేస్తున్న ఎన్ఆర్ఐ రామలత

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో భక్తుల సౌకర్యార్థం ఎన్ఆర్ఐ ఎలమర్తి ప్రవీణ్, రామలత దంపతులు రూ.25 వేలు విలువ చేసే 500 స్టీల్ గ్లాసులను వితరణ చేశారు. శనివారం దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావుకు వీటిని అందజేశారు. అలాగే భీష్మ ఏకాదశి సందర్భంగా చిన్నారులకు పంపిణీ చేసేందుకు గాను స్థానిక సత్యదేవ ఏజెన్సీ నిర్వాహకులు వంద లీటర్ల పాలు, శ్రీప్రకాష్ విద్యాసంస్థలు (పాయకరావుపేట) 5,500 బిస్కెట్ ప్యాకెట్లు అందజేసినట్టు అధికారులు తెలిపారు.

వైభవంగా తంటికొండ వెంకన్న తెప్పోత్సవం

గోకవరం: మండలంలోని తంటికొండలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి తెప్పోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్సవ విగ్రహాలకు వెంకటగిరి కొండ వెనుక ఉన్న బద్దిరెడ్డి వారి చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు. దేవస్థానం మాజీ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర, తులసి దంపతులు పీటలపై కూర్చొని పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తెప్పోత్సవాన్ని తిలకించారు.



స్వామివారికి పూజలు చేస్తున్న బద్దిరెడ్డి అచ్చన్నదొర దంపతులు

ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- స్వామివార్లకు ప్రత్యేక పూజలు



అన్నవరంలో గరుడ వాహనం మీద సత్యదేవుడు, అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: భీష్మ ఏకాదశి వేడుకలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో శనివారం వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పలు ఆలయాల్లో ఉదయం నుంచి భజనబృందాలతో ఏకాహాలు నిర్వహించారు. దీంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. స్థానిక షిర్డీనగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏలేశ్వరం, లింగంపర్తికి చెందిన భజన కళాకారులు భజన కాలక్షేపం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలమూరి సుబ్బారావు, గెడ్డం సత్తిబాబు, ఆకుల నూకపతిరావు, భజంతుల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని సత్యనారాయణస్వామి ఆలయాన్ని సుందరంగా ఆలకరించారు. వేంకటేశ్వరస్వామి ఉపాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. అర్చకులు పొన్నూరు సత్యనారాయణచార్యులు, లక్ష్మీనరసింహచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

రత్నగిరి...భక్తజనఝురి

అన్నవరం: భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తరలి వచ్చిన వేలాది మంది భక్తులతో శనివారం రత్నగిరిపై సత్యదేవుని ఆలయం కిటకిటలాడింది. ఈ సందర్భంగా పుష్పాలు, విద్యుత్ దీపాలతో స్వామివారి ఆలయాన్ని, ఆలయ ప్రాంగణాన్ని అలంకరించారు. పలువురు కళాకారులు పలు సాంస్కృతిక కళారూపాలు ప్రదర్శించారు. వేలాది మంది భక్తులకు సర్క్యులర్ మండపంలో పులిహోర, దద్దోజనం పంపిణీ చేశారు. చిన్నపిల్లలకు పాలు పంపిణీ చేశారు. ధ్వజస్తంభం, అనివేటి మండపం వెలుపల చేసిన చేసిన పుష్పాలంకరణ ఆకట్టుకుంది. కాగా శనివారం రాత్రి వెండి గరుడ వాహనం మీద సత్యదేవుడు, అమ్మవారిని అన్నవరం పురవీధుల్లో ఊరేగించారు.

రౌతులపూడి: భీష్మ ఏకాదశి సందర్భంగా స్థానిక ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. రాత్రికి స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

ప్రత్తిపాడు: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక రుక్మిణీసత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం చామంతి పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గోకవరం: భీష్మ ఏకాదశి వేడుకలను శనివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. తంటికొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, పోస్టల్ కార్యాలయం సమీపంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల వద్ద స్వామివారి కల్యాణోత్సవాలు వైభవంగా జరిగాయి. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉదయం వేద పండితులు ద్విభాష్యం సూర్య వెంకట సుబ్బారావుశర్మ, వల్లూరి శ్రీనివాస్‌శర్మ స్వామివారి కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. రాత్రి పోస్టల్ కార్యాలయం సమీపంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఈ కల్యాణ వేడుక ఘనంగా జరిగింది. తొలుత స్వామి వారిని గ్రామంలో పల్లకీపై ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



గోకవరంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు

మల్లిపాకలో ప్రత్యేక పూజలు

జగ్గంపేట: భీష్మ ఏకాదశి సందర్భంగా శనివారం మల్లిపాక ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ఏకాహం నిర్వహించారు. జగ్గంపేటలో పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలోనూ ఏకాహం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



ప్రత్తిపాడు వేణుగోపాలస్వామి ఆలయంలో చామంతి పూజ

కిర్లంపూడి: బూరుగుపూడిలో వేంచేసిన అభయాంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం అన్నసమారాధన నిర్వహించారు. భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

తొండంగి: భీష్మ ఏకాదశి సందర్భంగా శనివారం మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దానవాయిపేటలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఏవీ నగరంలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్లకు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, విజయలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, బండారు సత్యానందరావు తదతర ప్రముఖులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

గండేపల్లి: విద్యార్థులు తమకు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు సూచించారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న వెబ్ డెవలప్‌మెంట్, డిజైన్ థింకింగ్ ఫర్ ఎస్డిజీ వర్క్‌షాప్‌లో చివరి రోజు శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రెయిన్ ఓ విజన్ సహకారంతో ఈ వర్క్‌షాప్ నిర్వహించినట్టు తెలిపారు. విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి, కొత్త విషయాల రూపకల్పనకు, వినూత్న ఆలోచనలకు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, అకడమిక్ డైరెక్టర్ కె. సత్యనారాయణ, ప్రిన్సిపాల్ జి.నరేష్ పాల్గొన్నారు.

గుండె పోటుతో వ్యక్తి మృతి

శంఖవరం: మండలంలోని నెల్లిపూడి పంచాయతీ టి.అగ్రహారంలో గుండె పోటుతో వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. శంఖవరం గ్రామానికి చెందిన కురందాసు లోవకుమార్ (35) టి.అగ్రహారంలో మిడ్డే మీల్స్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. శనివారం వంటశాలలో వంట చేస్తుండగా లోవరాజుకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో స్థానికులు వైద్యం నిమిత్తం సీతంపేట రిఫరల్ ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య,కుమార్తె ఉన్నారు.